నూరేళ్ళ తెలుగు కథకు

**నవ్య నీరాజనం - 79**

నూరేళ్ళ తెలుగు కథకు



# నాకు సాహిత్యమే లోకం! సాహిత్యమే జీవితం!

**- అట్టాడ అప్పల్నాయుడు**

అటు ఉప్పొంగే అడవుల నుండి ఇటు ఎగిసి పడే కడలి కెరటాల దాకా ఉత్తరాంధ్ర గుండె చప్పుడు వినిపిస్తున్న ఉత్తమ కథకుడు అట్టాడ అప్పల్నాయుడు. మనిషి పట్ల మమకారం, సమాజం పట్ల ప్రేమ, బ్రతుకు పట్ల ఆర్తి గల ఈయన కథలు శ్రీకాకుళం మట్టి పరిమళాలతో గుబాళిస్తూ సామాజిక బాధ్యతను గుర్తుచేస్తాయి. ఉద్యమ అవసరం కోసమే కథకుడైన ఈ రచయిత సాహిత్యమే ఉద్యమంగా జీవిస్తున్నాడు. పువ్వుల కొరడాతో కథల బండి ఎక్కిన అప్పల్నాయుడు ఎనభైకి పైగా కథలు, మూడు నవలలు, కొన్ని నాటకాలు ఎన్నో వ్యాసాలతో పాటు కొన్ని పత్రికలలో శీర్షికలు నిర్వహించి సాహితీ ప్రపంచంలో తనదైన ఒక ప్రత్యేక స్థానం పదిలపరుచుకున్నాడు. రాజకీయ పరిణామాలకు స్పందనగా తనదైన శైలిలో వ్యంగ్యాస్త్రాలను సంధించాడు. మానవ జీవన విషాదాల్ని కథలుగా అందించాడు. చరిత్రగా నమోదు చేస్తున్నాడు. కొంచెం వెటకారం, కొంచెం వ్యంగ్యం, మరి కొంచెం ఎత్తిపొడుపు రంగరించి కథాస్త్రాలను సంధించే కలం యోధుడు అప్పల్నాయుడుతో ఇంటర్వ్యూ మీ కోసం...

### అత్తల కోసం ఆస్తులు హాంఫట్!

1953లో ఆగస్టు 23న అప్పటి శ్రీకాకుళం జిల్లా, ఇప్పటి విజయనగరం జిల్లా 'గుమడ' గ్రామంలో పుట్టేన్నేను. నాకు బాల్యం పోయేసరికి మాకుండే కొద్ది పాటి ఆస్తి కూడా పోయింది, వ్యవసాయం కలిసిరాక. 1969 ఏప్రిల్ ఎస్సెస్సెల్సీ చివరి బేచ్ మాది. కోటిపాం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు రోజూ కేరేజీ...పుస్తకాల సంచీతో నడిచివెళ్ళే వాళ్లాం. బస్సున్నా...చార్జీలుండాల గదా! నా తండ్రికి ఐదుగురు అప్పజెల్లెళ్ళు. వారి పెళ్ళిల్లూ...కథాకార్యాలూ...అప్పులూ...ఆర్భాటాలతో నా హైస్కూల్ చదువు పూర్తయ్యేసరికి మిగిలి వున్న కొద్ది పాటి మడిసెక్కలు తరిగి పోయేయి. ఆ కారణంగా నేను ఎస్సెస్సెల్సీ పాసైనా కాలేజీ చదువులకి పంపలేక పోయేడు మా తండ్రి.

### జులై పది...నాకు బాగా జ్ఞాపకం

నా హైస్కూలు చదువు పూర్తయ్యేనాటికి మాకు బంధువు, నాకు చిన్నాన్న వరస అయిన లంక నరసింహులు గారు మా వూరు టీచరుగా వొచ్చేరు. శ్రీకాకుళ గిరిజనోద్యమానికి బాసటగా నిలిచిన పెదమేరంగి వాస్తవ్యుడాయన. అతని ప్రభావం నన్ను అప్పటి జీవితానికి భిన్నమైన మార్గంలోకి మళ్ళించింది. అంతవరకూ నాలో వున్న అనేక సందేహాలకు, ప్రశ్నలకు సమాధానంగా ముందుకు నడిపించింది. అప్పటికే శ్రీకాకుళోద్యమం సాయుధ దశకు చేరింది.



కుటుంబ సభ్యులతో...

నరసింహులు మాష్టారు ప్రదర్శింపజేసిన నాటకాలు, యువజన సంఘం వామపక్ష భావాలు ఇవన్నీ నన్ను ఎటు మళ్ళిస్తాయోనని మా తండ్రి వున్న మడిసెక్క అమ్మేసి పార్వతీపురం కాలేజీలో చేర్పించేడు నన్ను.

1970లో ఇంటర్మీడియట్ రెండో సంవత్సరంలో చేరేను. బెలగాం చర్చి వీధిలో ఓ గదిలో వంట చేసుకుని చదువుకోవడం. మా పక్క రూమ్‌లో గౌరు నాయుడు ఉండేవాడు. ఇద్దరం చర్చి వీధి పార్కులో గంటల కొద్దీ కబుర్లు చెప్పుకునే వాళ్ళం. నేను చదివిన పుస్తకాల గురించి, చాలా విషయాల గురించి.

ఆరోజు జులై పదో తేదీ. మేం మాట్నీకని బయలుదేరాం. గవర్నమెంట్ ఆసుపత్రి దగ్గర కొచ్చేసరికి. ఆ పరిసరాలు, రోడ్లు జనంతో నిండి పోయున్నాయి. చెప్పేరెవరో, గిరిజనోద్యమ నేతలు వెంపటాపు సత్యం, ఆదిభట్ల కైలాసం మృతదేహాల్ని తెచ్చేరని. ఆ నాయకుల పట్ల జనాని కున్న ఆసక్తి, ఆరాధాన మమ్మల్ని చకితుల్ని చేసింది. నా ఇంటర్ పూర్తయ్యింది. డిగ్రీ చదివించే శక్తి లేదని నా తండ్రి చేతులెత్తేసాడు. పోరాటం కూడా తగ్గుముఖం పట్టింది. నరశింహులు మాష్టారు బదిలీ అయి వెళ్ళిపోయేరు. కానీ అతని ప్రభావం నుండి మాత్రం నేను బయటపడ లేకపోయేను.

### నన్ను ఒప్పుకున్న కారా మాస్టారు

1977లో శ్రీకాకుళోద్యమ నాయకుడు మామిడి అప్పలసూరి గారమ్మాయి 'అరుణ' నా జీవిత సహచరి అయింది. పెళ్ళితో ఏర్పడ్డ పరిస్థితుల కారణంగా ఉద్యోగం వేటలో పడ్డాను. జంఝావతి రిజర్వాయర్ నిర్మాణ కంపెనీలో ప్రైవేట్ కూలీగా చేరాను. చేరిన ఏడాది లోపే తీసేసారు. నౌకరీ కోసం ఎంత తిరిగానో! చివరికి 'నాగావళి' వారపత్రికలో దుప్పల కృష్ణమూర్తి నౌకరీ యిచ్చి ఆదరించేరు. అదిగో అప్పుడు ఆ పత్రిక కోసం ఏదో రాసేవాణ్ణి. మిత్రుల నుండి రచనలను ఆహ్వానించే వాణ్ణి. ఆ సందర్భంలోనే భూషణం గారు రచనా విరామం తీసుకున్నారు. తెలిసిన విప్లవోద్యమం వుంది. మనమే ఎందుకు రాయగూడదు అనుకున్నాను. రాసేను. తొలి కథ 'పువ్వుల కొరడా'. సృజనలో అచ్చయ్యింది. అంతే! యిక వెనుతిరిగి చూడలేదు. రహస్యోద్యమాన్ని బలపరిచే సాహిత్యం మాత్రమే సాహిత్యమని అప్పటి నా నమ్మకం (అది సరైంది కాదని తెలుసుకున్నాననుకోండి)

కథా సాహిత్య అధ్యయనం, సామాజిక అధ్యయనం గురించి చెప్తూ ఓ సారి కా.రా మాష్టారు ''విప్లవ కథకుడిగా ముద్ర పడిన వాడివి గనుక నీ పేరుతో కాకుండా కలం పేరుతో నీవు చూస్తోన్న... నీ అనుభవం లోంచి ఎరుకలోకి వస్తున్న వాటిని కథలుగా రాయి. కథ రాయడానికి అభ్యాసంగా కూడా పనికొస్తుంది'' అన్నారు. మాష్టారి మాటల్లోని సాహిత్య సామాజిక అధ్యయనాల అవసరం నాకంతగా అనిపించలేదు గానీ అభ్యాసం కోసం 'వరీనియా' కలం పేరుతో రాసేను.

నెమ్మది నెమ్మదిగా మూడు ప్రాంతాల రచయితల్ని చదవ నారం భించేను. కా.రా మాష్టారితో ఎక్కువసార్లు కలిసే అవకాశం లభించింది. సాహిత్య కర్తవ్యం, సాహిత్య ప్రయోజనం కాస్త అర్థమయ్యింది. సాహిత్యమే నాకు ఇష్టమైన కార్య క్షేత్రమయ్యింది. 1988లో 'పోడు-పోరు' కథా సంపుటి వచ్చిన తరువాత నాలుగేళ్ళు ఏమీ రాయలేదు. 1992 తర్వాత విరివిగా రాసేను. రాజకీయ వాదులు నన్ను 'సాహిత్యజీవి' అన్నారు. సాహిత్యజీవులు నన్ను 'రాజకీయవాది' అన్నారు. 1995లో 'ప్రత్యామ్నాయం' కథతో నన్ను 'సాహిత్యజీవి'గా ఒప్పుకున్నారు కా.రా. మాష్టారు.

### అనేక భాషల్లోకి 'మడిసెక్క'

ఉద్యోగం కోసం చినమేరంగిలో వున్న రోజుల్లో పెదమేరంగి జననాట్య మండలి కోసం 'మడిసెక్క' నాటకం రాసేను. అనేక ప్రదర్శనలు యిచ్చేం. మిత్రుడు రౌతు వాసుదేవరావు దర్శకుడు. నేనో పాత్ర కూడా ధరించేను. జనం బాగా ఆదరించేరా నాటకాన్ని. అదే నాటకాన్ని రేడియో నాటకంగా కుదించి ఆలిండియా రేడియో నిర్వహించే జాతీయ నాటక పోటీకి పంపితే దానికి ప్రథమ బహుమతి లభించింది. అది అనేక భారతీయ భాషల్లో ప్రసారమయ్యింది.

### వీడియో చిత్రం

పార్వతీపురం ఐటిడిఏ వారు గిరిజన విద్య అంశంగా బి.హెచ్.రామ్మూర్తి దర్శకత్వంలో వీడియో చిత్రం నిర్మించారు. దానికి మాటలు రాసాను. అప్పటి గిరిజన సంక్షేమాధికారి చినవీరభద్రుడు ఆ చిత్రంలో ఓ పాట రాసేరు. గౌరునాయుడు కూడా పాట రాసేరు.

### శ్రీకాకుళ సాహితి

సాహితీ మిత్రులందరం కలిసి శ్రీకాకుళంలో 'శ్రీకాకుళ సాహితి' ని స్థాపించాం. ప్రతి నెలా సభలు, సమావేశాలు, కథా చర్చలు జరపడంతో పాటు 'జముకు' బులెటన్లు తెచ్చాం. అంతే కాకుండా ఉత్తరాంధ్రలో గల నదుల

## ఇష్టమైనవి

| | | |
|---|---|---|
| సినిమా | : | సత్యమే శివం |
| హీరో | : | కమల్‌హాసన్ |
| హీరోయిన్ | : | త్రిష |
| సంగీత దర్శకుడు | : | రెహమాన్ |
| గాయని | : | చిత్ర |
| గాయకుడు | : | గద్దర్ |
| ఆహారం | : | మాంసాహారం |
| నవల | : | మాలపల్లి |
| కథకుడు | : | కా.రా |
| మిత్రుడు | : | గంటేడ గౌరునాయుడు |
| సినిమా పాట | : | ఏ శ్వాసలో చేరితే గాలి గాంధర్వమౌతున్నదో |
| కవి | : | శివారెడ్డి |
| కవిత | : | అంతర్జ్వలనం |
| నాటకం | : | కన్యాశుల్కం |

పేర్లతో నాగావళి కథలు, వంశధార కథలు, జంఝూవతి కథలు యిప్పటిదాకా వెలువరించాం. ఈ సంకలనాలతో దాసరి రామచంద్రరావు, చింతా అప్పల్నాయుడు, చింతాడ తిరుమలరావు, మల్లిపురం జగదీశ్...వంటి ఎందరో యువ కథకులు సాహితీ లోకానికి పరిచయమయ్యేరు. శ్రీ సా. స్ఫూర్తితోనే 'స్నేహ కళాసాహితి' కురుపాం ఆవిర్భవించిందని చెప్తాడు గౌరు నాయుడు.

### సాహితీ మూర్తుల ప్రభావం

నేను చదివిన ఎందరో రచయితల ప్రభావం ఏదో రూపంలో వుండే వుంటుంది. మరీ ముఖ్యంగా రా.వి. శాస్త్రి, కా.రా, పతంజలి...వీరి ప్రభావం నా మీద వుందని ప్రత్యేకంగా చెప్పనక్కర్లేదు. కా.రా. మాష్టారంటే బాగా ఇష్టం. ఆ ఇష్టమే నాచేత 'యజ్ఞం తర్వాత...' కథ రాయించింది.

### కుటుంబ సభ్యుల స్పందన

నాకు సాహిత్యమే జీవితం. అయితే జీవిక కోసం ఏదో చెయ్యాలి గదా. అందుకు ఉద్యోగం. నాకు సాహిత్యమే లోకం. నా కుటుంబ సభ్యులకు కాదు. వారికి జీవితంలో అనేక విషయాల్లో సాహిత్యం ఒకటి. నా సహచరి, నా పిల్లలు... కోడలు అంతా నా రచనా వ్యాసంగానికి సహకరించే వాళ్ళే!

### ఎప్పుడైనా రాయలేని స్థితి...

రచన రాజకీయాల కోసమే! సామాజిక, రాజకీయ మార్పుల్ని చిత్రించడం



కారా మాస్టారుతో...



భార్య అరుణతో...

కోసమే అనుకున్నన్నాళ్ళూ రాత నాకేమీ అసౌకర్యమనిపించలేదు, ఉన్నది ఉన్నట్టుగా చిత్రించడమే కాబట్టి. అయితే రచనలో పరిణతి వచ్చేక సత్యాన్ని ఆవిష్కరించే ప్రయత్నంలో అసలు ఏది సత్యం? అనే అన్వేషణలో కొంత నలుగుడు తప్పనిసరయింది. అప్పుడే రాయడానికి కొంత గింజుకోసాగాను. ఆ సందిగ్ధ సందర్భమే రాయలేని స్థితికి కారణ మౌతోంది.

### మరచిపోలేని సంఘటన

1976లో జననాట్యమండలి కేసులో నేను విశాఖపట్నం సెషన్సు కోర్టుకు హాజరు కావల్సి వుంది. సరిగ్గా ఆరోజే నా చిన్న చెల్లెలు జ్వరంతో మరణించింది. అంత్యక్రియలు అయ్యాక బస్‌కి వెళ్లొచ్చు. కానీ.. చేతిలో డబ్బుల్లేవు. ట్రైన్‌లో అయితే టికెట్ లేకుండా వెళ్లొచ్చు. అందుకని అంత్యక్రియలు కాకుండానే కన్నీటితో బండి ఎక్కేను. ఆ సంఘటన తలచుకుంటే యిప్పటికీ నా కళ్ళల్లో నీళ్ళు తిరుగుతాయి.

### అవార్డులు

అవార్డుల పట్ల ఆసక్తి లేకపోయినా, అవి యిచ్చేవారి పట్ల గౌరవంతో స్వీకరించేను. రా.వి.శాస్త్రి రచనా పురస్కారం, కథా కోకిల పురస్కారం, జ్యేష్ఠ లిటరరీ అవార్డు, పులుపుల శివయ్య స్మారక అవార్డు, విశాల సాహితి పురస్కారం, అధికార భాషా సంఘం వారి పురస్కారం.. యిలా కొన్ని.

### సాహితీ సృజన ఎందుకంటే...

మారిన, మారుతున్న సామాజిక పరిస్థితుల్ని వివరించడానికి ప్రజావాహిని మీద ఏఏ శక్తుల ప్రభావాలు ఎంతెంతగా వుంటున్నవో నా పరిశీలన మేరకు నాకందిన జీవితం నుండి చెప్పేటందుకు కథలు రాసేను. నా తొలి రచన నుండి యిప్పటి దాకా రచయితగా జీవితాన్ని ఉన్నదున్నట్లు పరిశీలించి, దాని చలనాన్ని అధ్యయనం చేస్తూ, అవగాహనలోకి తెచ్చుకుంటూ ఆ మేరకు కలిగిన ఎరుకను తెలియజెప్పడానికి ఎనభై దాకా కథలు, మూడు నవలలు, కవిత, పాట తప్ప అన్ని ఆధునిక సాహితీ ప్రక్రియల్లోనూ రచనలు చేసాను. ఇప్పటిదాకా, పోడు-పోరు, ప్రత్యామ్నాయం, ఒక పొట్టివాడు-కొందరు పొడుగువాళ్ళు, క్షతగాత్ర గానం కథా సంపుటాలు, పునరావాసం, ఉత్కళం, అనగనగా ఒక రాజద్రోహం నవలలు, మడిసెక్క, ఉమ్మడి కుటుంబం నాటకాలు రాసాను.

పాతిక ముప్పై సంవత్సరాల క్రిందట మొదలైన యే ప్రజాపోరాటం నా రచనకు ఉత్తేజమైందో దానిపైనే నా ఆశలూ...విశ్వాసాలు. అయితే నా కార్యక్షేత్రం యిప్పటికీ సాహిత్య రంగమే! సాహితీ సృజన మాత్రమే!

**-లాంగుల్య**

నాకు నచ్చిన
నా కథ


# శిక్ష

- అట్టాడ అప్పల్నాయుడు

ఆలివ్ గ్రీన్ రంగులో కన్పిస్తోంది అడవి!

మూడుదిక్కులా యెత్తయిన కొండలు... మధ్యలో ఆకుపచ్చని లోయ! నాలుగో దిక్కున ఆలివ్ గ్రీన్ అరణ్యం!

కనుచూపుమేరా... పచ్చని జీవితం. కిలకిలా, కళకళా.... రకరకాల పక్షుల కుహు, కుహూ రాగాలు. పరుగులిడే లేగదూడలు. పశుల మందలు... పశుల కాపర్ల వేణుగానం, అడవిపూల వాసనల్తో చిరుగాలి పలకరింతల పులకరింపులు. కొండల మొదళ్ళలో... బారులుగా రెండు వరసల్లో - దర్భగడ్డి పైకప్పుల్తో నిలబడిన పూరిళ్ల 'వలస'లు. కొండపోడు భూముల మీద 'అరప'లు. అరపల మీద... పంటల కాపుగాచే రైతులు. 'వలస'ల్లో... అర్ధనగ్న వనకన్యలు, గోచీపాత ఆదివాసీలు...!



ఉదయ సంధ్యవేళ... సమస్తమూ చలనశీలమైన వేళ!

ఉదయ సంధ్య - యింత మనోహరంగా వుంటుందని - నిన్నటిరోజు - 'వాళ్ల' కోసం వెళ్లినప్పుడు - చూసి, తెలుసుకున్నాడు రాధాకృష్ణ!

బహుశా అలనాటి శ్రీరాముడికి - జానకిరాముడు కాకముందర - మునుల యజ్ఞ వేదికల రక్షణకోసం - ఆదివాసీలపై దాడికి వెళ్లినప్పుడు - యిదే ఉదయ సంధ్య... యిదే మనోహరంగా కన్పించి వుంటుందని కూడా - రాధాకృష్ణకి అప్పుడు స్ఫురించింది! అలనాటి శ్రీరామచంద్రుడు నడిచి వెళ్లాడో, రథం మీద వెళ్లాడో... తను మాత్రం హెలికాప్టర్ మీద...!

రాధాకృష్ణకి యింకా ఉదయ సంధ్యను వర్ణించాలన్పించింది. గానీ, ఆ వెంటనే - ప్రభాకర్‌జైన్ మాటలు.

".....భారతీయులం - భావనా ప్రపంచంలోనే బ్రతికేం... భౌతిక ప్రపంచాన్ని వొదిలేసాం. సెంటిమెంట్సు-సంపదనుకున్నాం. జస్ట్.... యిప్పుడే ఆరంభమైంది - కొత్త తరం! ప్రతిభతో పురోగతిని సాధించే తరం. వీరికి - ఉదయ సంధ్య, గోధూళి వేళ, గోపీకృష్ణ వేణుగానం - భౌతిక జీవితావసరాలను తీర్చలేవని తెలిసింది..." గుర్తొచ్చేయి.

ప్రభాకర్‌జైన్ మాటలు గుర్తొచ్చేక - రాధాకృష్ణ కలం ముందుకి సాగలేదు. వృత్తి లోనూ, ప్రవృత్తి... రచనా రంగం లోనూ-ప్రభాకర్‌జైన్ తనకి సరైన జ్ఞానాన్ని అందిస్తుంటాడు. అంతదాకా రాసిన విషయాన్ని - మరోసారి చూసుకున్నాడు.

ఆలివ్ గ్రీన్ అరణ్యంలో – ఉదయ సంధ్య... శ్రీరామ చంద్రుల వారు 'యజ్ఞవేదికొల రక్షణకోసం.. దాడికి వెళ్లినట్లు... తను 'వాళ్లు' మీద దాడికి సిద్ధపడటం... వరకూ రాసేడు.

ఇంతలో – రూములోకి ఒక ఎస్సయ్ వచ్చేడు. కుడిచేయీ, కుడికాలితో శబ్దవందనం చేసాడు. రాధాకృష్ణ అతనివైపు చూపు మరల్చాడు.

''సార్ చనిపోయిన స్పెషల్ పోలీస్ కానిస్టేబుళ్లు ముగ్గురిలో ఒకతని పేరెంటూ, బంధువులూ వచ్చేరు. గొడవ, గొడవ, చేస్తున్నారు – 'ఎలా చనిపోయేరు? నిజంగా, ఎన్‌కౌంటర్ జరిగిందా' అనడుగుతున్నారు.....''

రాధాకృష్ణకేం చెప్పాలో బోధపడ్లేదు.

కోవర్ట్ ఆపరేషన్! మూడు రోజుల కిందట సంపాదించిన ఇన్ఫర్మేషన్‌తో – నిన్న ఎన్‌కౌంటర్! తను హెలికాప్టర్‌లో ఎన్‌కౌంటర్ స్పాట్ పరిశీలించి – దగ్గరలో గల రెవిన్యూ గెస్ట్ హౌవుస్ నుండి... మొత్తం ఆపరేషన్ నిర్వహించేడు. తోడుగా, ఎస్పీ ప్రభాకర్‌జైన్, మరో యిద్దరు డిఎస్పీలూ! ఎన్‌కౌంటర్ స్పాట్‌లో, స్పెషల్ పోలీస్ సి.ఐ. గ్రే హవుండ్స్ అధికార్లూ! అక్కడికీ, గెస్ట్‌హౌస్‌కీ... వాకీ టాకీ కనెక్ట్ చేసాం!

హెలికాప్టర్‌లూ, వాకీటాకీలూ, రైఫిల్ బాంబింగూ.... హైటెక్ ఎన్‌కౌంటర్ అని – పౌరహక్కుల వారి కామెంట్!

ఇంత బలగము, యిన్ని జాగ్రత్తలూ తీసుకున్నా – ముగ్గురు మెన్ నేల కొరిగేరు! 'వాళ్లో...?' స్పాట్‌లో పది మంది కొందరు గాయాల్తో పరారయ్యేరు గానీ – వాళ్లూ మరణిస్తారు... గాయాలు తీవ్రమైనవి! అడవిలో... యెన్నాళ్లుంటారు. మందూ మాకూ దొరకక!

ఆలివ్ గ్రీన్ అరణ్యం... మనోహరమైన లోయలో ఉదయ సంధ్యవేళ... వసంతకాల మేఘగర్జనల్తో కాదు – తుపాకీల కాల్పుల్తో మార్మోగి పోయింది. ఆలివ్ గ్రీన్ అడవి అతలాకుతలం అయిపోయింది. ఎర్రటి నెత్తురు.. పచ్చనాకుల రుచి చూసింది. రామ చిలుకలు రెక్కలుతెగి నేల కొరిగేయి. తుళ్లింతల్తో పరుగులిడే లేగదూడ గంగడోలును చీల్చుకు – తుపాకీగుళ్లు దూసుకుపోయేయి. ఓ పశువుల కాపరి దేహం – చిల్లులు పడ్డ వేణువయ్యింది. ఎదురెదురు తుపాకీ కాల్పుల మధ్య – అడవి 'అమ్మా' అని చావుకేక వేసింది!

ముందుగా, యిన్ఫార్మర్ చెప్పిన ప్రకారం స్పాట్ గుర్తించి – మూడు కొండల మీదకి చేరిపోయింది బలగం. బైనాక్యులర్స్‌లోంచి చూస్తే – లోయలో దృశ్యం అస్పష్టంగా కన్పిస్తోంది. లోయలో – శిబిరాలు వేసి సమావేశమయ్యేరు. 'వాళ్లు'. ఎక్కువమందే వున్నట్టుంది. (ప్లీనం అట! దొరికిన వంట సామగ్రీ, రికార్డుల బట్టి ధృవపడింది)

శిబిరాలకు ముందర, చెక్కపెట్టలకు ఎర్రటి వస్త్రాన్ని చుట్టి – నిర్మించిన స్థూపం! స్థూపం మీద యెగురుతోన్న ఎర్రజెండా! స్థూపానికి అభి ముఖంగా, పశ్చిమదిక్కులో తుపాకీతో సెంట్రీ! తూర్పునా సెంట్రీ వుండే వుంటాడు – కన్పించలేదు.

లోయకి చుట్టూ, మూడు వైపులా కొండల మీదుగా, బలగం గప్‌చిప్‌గా చేరుకుంది. లోయలో దృశ్యం... యిప్పుడు స్పష్టంగా కన్పిస్తోంది. ఆలివ్ గ్రీన్ యూనిఫాంలో 'వాళ్లు' – స్థూపం చుట్టూ నిల్చొని – సమావేశ ఆరంభ గీతం ఆలపించసాగేరు. సెంట్రీగూడా – అమరుల సంస్మరణ కార్యక్రమం వైపే దృష్టి మరల్చి – గీతాలాపనలో నిమగ్నమైనాడు.

సరిగ్గా, అప్పుడే ప్రభాకర్‌జైన్.

''ఎటాక్, ఊిc.... ఫైర్....'' ఆర్డర్ చేసాడు. ప్రభాకర్‌జైన్ – గెస్ట్‌హౌస్‌లో రాధాకృష్ణని దించేసి, స్పాట్‌కి మెన్‌తో ఫాలో అయ్యేడు.

మూడువైపుల గుళ్లవర్షానికి... దాదాపుగా ఆరేడుగురు అక్కడికక్కడే కుప్ప



కూలిపోయేరు. మిగిలినవాళ్లు రెప్పపాటులో షెల్టర్స్‌లోకి పరారయి పోయేరు. సెంట్రీ తుపాకీ పేల్చుకుంటూ – దగ్గరి 'వలస'లోకి పారిపోతే, వెంబడించిన మెన్... ఓ యింట్లో కాల్చి చంపేరు. తిరిగొస్తుండగా – కాలిపాదం తెగిపడీ, పారిపోవ వీలుగాక షెల్టర్‌లో వుండిపోయిన జయరాజ్ కంటబడ్డారు. జయరాజ్ తెగిన పాదానికి, కిట్‌లోంచి తువ్వాలు తీసి కట్టుగట్టి – పొజిషన్ జేసుకు షూట్‌చేసాడు. ఒకని తర్వాత వొకరు – ముగ్గురు మెన్ నేలకొరిగేరు. ఈలోగా యింకోవైపు నుంచి దెబ్బతిన్న చిరుతపులిలా – పూర్ణక్క వున్న గుళ్ళన్నీ ఖాళీ జేసుకు కాలుస్తోంది. ఆమె కారణంగా మెన్ ముందుకెళ్లలేకపోయేరు – కళ్ల ముందే 'వాళ్లు' చాలామంది పారిపోసాగేరు. పూర్ణక్క తొడలు రెంటిలోనా గుళ్లు దూసుకు పోయి – కూలినచోటు నించే కాలుస్తోంది.

''పరిస్థితి బాగాలేదు 'వాళ్ళు' యెక్కువమందే చచ్చినా, మనవాళ్ళూ ముగ్గురు చనిపోయేరు. అట్నించి ఎటాక్ గట్టిగా వుంది. బాంబింగ్ చేయించేదా?'' ప్రభాకర్‌జైన్ రాధాకృష్ణని, వాకీ టాకీలో అడిగేడు.

''బాంబింగ్ యీజ్ యిల్లీగల్...''

''దటీజ్ నాట్ ది పాయింట్ నౌ....''

''వాళ్ళు మన పౌరులు, సిటిజన్స్...''

''వెనక్కొచ్చేమంటారా? మనవాళ్ల శవాలను కూడా తెచ్చుకోలేం...'' కోపంగా ప్రభాకర్, తను అంగీకరించటం, బాంబింగ్ జరగటం, 'వాళ్లు' మరో యిద్దరు మరణించటం – ఆ యిద్దరే – పూర్ణక్కా, జయరాజ్‌లని వాళ్ళ మృత దేహాల్ని బట్టి పోల్చి, మెన్ 'వాళ్లో' సాహసాన్ని విచిత్రంగా చెప్పటం – నిన్నటి లోనే వున్నాడు రాధాకృష్ణ.

''సార్... బాడీస్ కోసం బంధువులు వెళ్తామంటున్నారు...'' ఎస్సయి మళ్లీ చెప్పటంతో ఆలోచన లాపి, నేటిలోకి వచ్చి–

''పేరెంట్స్‌ని మాత్రమే రమ్మను – మాట్లాడతాను..'' చెప్పాడు రాధాకృష్ణ.

ఎస్సయి వెళ్లిపోయేడు.

తీరా – పేరెంట్స్‌వొస్తే యేం మాట్లాడాలి? కడుపు శోకంతో వున్న వాళ్ల నెలా ఓదార్చాలి. కుటుంబ సభ్యుని కుద్యోగం, మరణానికి పరిహారంగా ధనం... యివీ ఓదార్పు పలుకులేనా...?

ఒక తెగిన దుఃఖపు గొంతును – చీరకొంగుతో నొక్కేస్తూ తల్లీ–గుండె లోపలే సుళ్లుదిరిగే కన్నీళ్లతో తండ్రీ, వారికి తోడుగా ఓ బంధువూ ప్రవేశించేరు. ఎస్సయ్ వారితోపాటు వచ్చి – ఎటెన్షన్‌లో నిల్చున్నాడు.

వార్ని ఆహ్వానించి, కూర్చోమని చెప్పి–

''జరిగిందానికి విచారిస్తున్నాం. బాడీస్ కాసేపట్లో వస్తాయి...'' రాధాకృష్ణ మాటలు వెదుక్కుంటున్నాడు.

''....నిజంగా, మావాడ్ని– 'వాళ్లే' కాల్చారా?'' తల్లిదండ్రుల్తో వచ్చిన బంధువు ప్రశ్నించేడు. రాధాకృష్ణ ఆయనవైపు తేరిపార చూసాడు. బంధువు కూడా సూటిగా ఆయన కళ్లల్లోకే చూస్తున్నాడు. ఆ కళ్లు భయం గొలిపేయి. ఓ క్షణకాలం ఆ కంటిచూపు మృతి చెందిన కానిస్టేబుల్ కంటి చూపులూ – మరో క్షణకాలం – మృతిచెందిన 'వాళ్ల' కంటి చూపులా భ్రమింపజేసింది! వెంటనే, సీట్లో సర్దుకు కూర్చొని, తేరుకొని–

''ఔను, 'వాళ్ల' కాల్పుల్లోనే...'' జవాబిచ్చేడు రాధాకృష్ణ.

''మీరు స్పాట్‌లో వున్నారా?''

రాధాకృష్ణ బదులివ్వలేదు.

తల్లిదండ్రుల దుఃఖపు మేఘం ఓ క్షణం తెరిపినబడింది. గానీ, ఎయిర్ కండిషన్డ్ గదంతా – దుఃఖం వర్షించి, తడచినట్టు చల్లగా – చావు గడపలా వుంది.

''...వాళ్లు ఎదురుకాల్పులే జరపనప్పుడు – మావాడెలాగ చనిపోయేడు?'' మళ్లీ – ఆ బంధువే, కరుకుగా ప్రశ్నించేడు. ఆయన కిందులో యేదో తిరకాసున్నట్లనిపిస్తోంది. కిందటి ఎన్నికల్లో తమ గ్రామంలో, తామంతా గ్రామంలో ఒక సమస్యకోసం – ఎన్నికలు బహిష్కరిస్తే – కౌంటింగ్‌లో – తమ గ్రామంలో ఎనభై శాతం పోల్ అయినట్లు ఎన్నికల అధికారి ప్రకటించిన... సందర్భం గుర్తొస్తోంది ఆయనకు!

ఆ బంధువు ప్రశ్నలకు, ఆయన తీరుకి కోపగించిన ఎస్సయి–

''పౌరహక్కుల వాళ్లలాగ మాట్లాడొద్దు.....'' గసురుకున్నాడు.

రాధాకృష్ణ అప్పుడు – ఎస్సయ్‌వైపు.... చురుగ్గా చూసేడు.

''ఔన్సార్. వాళ్లూ వచ్చేరు. ఎన్‌కౌంటర్ బూటకమట. 'వాళ్లు' నిరాయుధులుగా వున్నప్పుడు, చుట్టుముట్టి కాల్చేసామట! 'వాళ్ల' బాడీస్ తెస్తున్నారా? 'వాళ్ల' బంధువులను రప్పించారా – అనడుగుతున్నారు... ' సంజాయిషీ ధ్వనిలో వివరణ యిచ్చేడు ఎస్సయి.

రాధాకృష్ణ కిదంతా – తను రాస్తోన్న కథలో భాగమా – జరుగుతోన్న వర్తమానమా – అయోమయంగా వుంది.

అడవిలో 'వాళ్ల' సమావేశ స్పాట్ గుర్తించేక, ఎన్‌కౌంటర్ ఆపరేషన్ ప్లాన్ చేసినప్పుడు – మరోవైపు 'కథ' రాయడమూ ఆరంభించేడు. టెన్షన్‌తో నిండిన, చావు, పుట్టుకల పొలిమేరలలో అందరూ వుంటే – తను కథ రాసుకు కూర్చోవటం – యెవరికన్నా తెలిస్తే – నీరో చక్రవర్తి సామెత గుర్తు దెస్తారని – రహస్యంగా యెవరికీ తెలియకుండా రాస్తోన్న కథ... ఎన్‌కౌంటర్ పూర్తయి – కథ పూర్తికాలేదు.

''వాళ్ల కదలికలు తెల్సినవాడిచ్చిన ఇన్ఫర్మేషన్‌తో గదా – కూంబింగ్‌కి మీరు వెళ్లారు...?'' ఆశించిన యే జవాబునో రాబట్టేందుకు, మళ్లీ ఆ బంధువే ప్రశ్నించాడు.

''ఎస్.... ఎస్. లేకపోతే మనకి తెలీదు. అది, మ్యాపులో గూడా గుర్తించ లేని ప్రాంతం. ఇన్‌ఫార్మర్ వల్ల... యీజీ అయ్యింది...'' చెప్పాడు రాధాకృష్ణ.

''....మన రాష్ట్ర భూభాగమే కాదట – పౌరహక్కుల వాళ్ళంటున్నారు... అలాంటి ప్లేస్...'' ఎస్సయ్ కష్టభరితమైన ఎన్‌కౌంటర్ గూర్చి ఉత్సాహంతో చెప్పబోయేడు.

''....మా వాడికంటే అమాయకులెవరూ దొరకలేదా మీ కథకి?'' బంధువు – బాంబు విసిరినట్టు విసిరేడు తన ప్రశ్నని.

రాధాకృష్ణ... గతుక్కుమన్నాడు. ఆ ప్రశ్న ఆంతర్యం బోధపడింది. జరిగిన కాల్పుల్ని ఎన్‌కౌంటర్‌గా నమ్మించేందుకు – వారి బిడ్డని చంపేమని.. భావిస్తున్నాడు...! అంటే 'వాళ్ల'తో ఎదురుకాల్పులు.. కథే..?

''అసలెందుకూ బాబూ చంపేయాలి?'' గుండె లోపలి దుఃఖాన్ని మింగి, మింగీ, గొంతు పెగిల్చి – ఆవేదనగా ప్రశ్నించేడు తండ్రి.

ఆ ప్రశ్న అర్థంగాలేదు రాధాకృష్ణకి. ఎందుకు చంపేయాలి – అని యెవరి గురించి వాపోయి వేసిన ప్రశ్న.... 'వాళ్ల' గురించా? తన బిడ్డ గురించా..?

ఈ తండ్రి – యెవరి గురించి వాపోతున్నాడు..?

'వాళ్ల'నయినా యెందుకు చంపేయాలి..? ఔనెందుకు....? ఆ తండ్రి ప్రశ్న... యీ విధంగా రాధాకృష్ణ మనసులో ప్రశ్నలు వేసింది!

ఈ ప్రశ్నల్తో రాధాకృష్ణకి నిన్న 'వాళ్ల' కిట్ బ్యాగులు చెక్ చేసినప్పుడు చదివిన వాక్యాలు గుర్చొచ్చేయి. నిన్న ఎన్‌కౌంటర్ ముగిసేక, దొరికిన కిట్ బ్యాగులు, తుపాకులూ... తెచ్చి తనకు చూపించేడు ప్రభాకర్ జైన్. కిట్‌బ్యాగుల్లోని... 'వాళ్ల' డైరీలూ, రికార్డులూ – తనూ, ప్రభాకరూ... చాలా క్లీన్‌గా స్టడీ చేసారు. అదనపు ఇన్ఫర్మేషన్‌కోసం. ఆ సమయంలో కిట్‌బ్యాగులు మోసి తెచ్చిన – కానిస్టేబుళ్లెవరినీ – దగ్గర వుండనీయ లేదు. సీక్రెసీ మెయింటెయిన్ జేయాలని! ఆ కిట్ బ్యాగుల్లో ఒకదాని మీద–

''మనం... మరో ప్రపంచాన్ని... కలగంటున్నాం...'' ఎర్రటి అల్లిక దారంతో కుట్టిన అక్షరాలు, అందంగా కన్పించేయి.

ఆ కిట్‌బ్యాగ్ విప్పి, వెదికితే – డైరీ, కొన్ని నోట్‌బుక్స్ – ఓ యేడాది పసిబాలుని ఫొటో కన్పించేయి – ఫొటో వెనుక–

''మీ 'రేపటి' కోసం ... మా 'నేటి'ని త్యాగం చేస్తున్నాం...'' వాక్యాలు!

ప్రభాకర్ వాట్ని చూసి యేమీ స్పందించలేదు. తీసి, తనకిచ్చేసి – నోట్‌బుక్స్‌లో యిన్ఫర్మేషన్ చూడసాగేడు. తను మాత్రం – ఆ వాక్యాలు అర్థం చేసుకుని.... అల్లాడిపోయేడు. డైరీ తీసి, పేజీలు తిరగవేస్తే – ఎన్‌కౌంటర్ ముందరి రాత్రి... రాసిన పేజీలో...

''కలల్ని కనురెప్పలే కాటేస్తున్న కాలమిది... కవి యెవరోగాని సరిగ్గా ఊహించేడు. మూడు దశాబ్దాల కిందట... ఓడిన పోరాటాన్ని దశాబ్ద కాలంగా రగిలించేం. మహేంద్రగిరి నుండి భద్రగిరిదాకా – అక్కడి నుంచి అటూ, యిటూ రాష్ట్రాలు దాటినాం. సహచరులారా.... మీరు వదిలివెళ్లిన కర్తవ్య నిర్వహణలో – నేను నిల్చున్నాను. ఇదిగో – యిక్కడ... మీ వారసులు... నిల్చున్నారు...

నాకంతా ఉద్వేగంగా వుంది! మళ్లీ యిలా...

వీపున కిట్‌బ్యాగుల్తో, భుజాన తుపాకుల్తో, యివే అడవులూ, కొండల్లో...

## త్యాగఫలితాన్ని ఉన్నతీకరించాలని...



వసంతకాలాలు వస్తూ పోతున్నాయి. మేఘాలు, గర్జనలూ ఆకాశమంతా ఆవరించలేదు. ఈ సందర్భంలో మిత్రుడొకరు అమరుడైన కోపర్‌డంగ్ ఎన్‌కౌంటర్ నేపథ్యంలో నా లోలోపలి ఆరాటాన్ని చెప్పడానికి 'వాళ్ళు' కథ రాసేను. వాళ్ళ త్యాగానికి, చేరనున్న లక్ష్యానికీ నడుమ ఎంతో దూరం వుందని, ఈ దూరంలో వాళ్ళు మారాల్సిన అవసరముందని అనిపించి, ఆ అవసరాన్ని కథా రూపం చెయ్యాలని వాళ్ళ త్యాగ ఫలితాన్ని ఉన్నతీకరించాలనే ప్రయత్నంలో వచ్చిందే 'వాళ్ళు' కథ.

– అట్టాడ అప్పల్నాయుడు
**9440031961**

మూడు దశాబ్దాల కిందట ఒరిగినవీరుల... వార సులు – ప్లీనరీ సమావేశం!

నడచిన ఉద్యమబాటపై సమీక్ష.

నడవబోయే దారిపై చర్చ! అనుభవాల కల బోత! కొత్తగా దళాల్లోకి చేరిన వారి పరిచయం! నిర్బంధం నీలినీడ కారణంగా – దళంలోకి వచ్చిన వారే యెక్కువమంది! నాకెందుకో... యిది నచ్చలేదు. నిర్బంధాన్ని అక్కడే జనం మధ్యనే యెదుర్కొని – అంచెలంచెలుగా అక్కడ ఉద్యమాన్ని అభివృద్ధిచేసి, ఆ అభివృద్ధిని అందు కునే స్థాయికి జనాన్ని తేగలిగేక – అంతకుమిం చిన కర్తవ్యంగా – యెవరన్నా దళంలోకి వస్తే బాగుణ్ణు...

నిన్న అందరూ – నన్నడగటమే – అక్కా నువ్వెలగొచ్చినావ్ ఉద్యమం లోకి? సత్యం సారు నాటి నించీ ఉన్నవట గదా చెప్పవా అనడగ టమే!

అప్పుడే నాకు ఉద్వేగం కలిగింది. ఓవైపు నాడు ఒరిగిన నేతలు గుర్తొస్తున్నారు. ఇంకో వైపు... సహచరుల ధృడ సంకల్పం!

చాలా చెప్పాలనుకున్నాను. ఉద్దానం నుంచి ఆదివాసీ నేలదాకా ఆనాడు సాగిన ఆందోళనలు శత్రువు దాడి – జిల్లా కల్లోలిత ప్రాంతం కావటం – ఊళ్లూ, గూడేలూ తగుల బెట్టటం – అరె స్టులు, ఎన్‌కౌంటర్లు... నెత్తురు నిండటం – పోరాటం ఓటమి పాలుగావటం – ఎక్కడ నుండి ఆరంభించి, ఎక్కడ ఆపను...? కోరన్నతో ఆరంభించి... ఆరిక సోములతో ఆపనా...? తప్పొప్పుల సమీక్ష... అదృష్టమో, దురదృష్టమో – నేను అరెస్టు గాలేదు, ఎన్‌కౌంటర్‌కి గురికా లేదు. ఒక ఉద్యమ అనుభవంతో – మరో ఉద్య మానికి నడుస్తున్న దాన్ని! ఓటమి నుంచి.... విజ యానికి... ! ఔనా! యేమో...! మళ్లీ గతమే పున రావృతమవుతున్నట్లుంది. నెలకో ఎన్‌కౌంటర్.... సహచరులు... ముగ్గురూ... నలుగురూ... వొరిగి పోవటం! విద్రోహం పెరిగిపోవటం... నిర్బంధం నీలినీడ కమ్ముకోవటం... 'ఉద్యమ బాటపై చర్చ'లో యీ విషయమ్మీద రేపు మాట్లాడాలి.

రాధాకృష్ణ సీరియస్‌గా చదవసాగేడు. అక్క డితో ఆపేజీ ఆగిపోయింది. ఆ ప్రక్క పేజీలో.

''ఆంధ్రాకు ప్రపంచ బ్యాంకు ఋణం''

''జన్మభూమిలో పెట్టుబడులు పెట్టమని ప్రవాస భారతీయులకు ముఖ్య మంత్రి విజ్ఞప్తి...''

''అణ్వస్త్ర ప్రయోగం దేశ గౌరవాన్ని పెంచింది – ప్రధాని'' పత్రికల్లో వార్తల శీర్షికలు రాసి – వాటి క్రింద – తన కామెంట్స్ రాసు కుంది.

డైరీ చదివేక – రాధాకృష్ణ.

''.... ఈమెని చంపి వుండాల్సింది కాదు..'' మనసులో అనుకున్నానని – బయటికే అనే సాడు.

''.... చంపటం, బ్రతికించటం... రెండూ మన చేతుల్లో లేవు. తుపాకులు నిర్ణయిం చేయి...'' బదులిచ్చేడు ప్రభాకర్ జైన్!

''.... వాళ్ల తుపాకులకి ఆశయముంది...''

''మన తుపాకులకి... విద్యుక్త ధర్మ ముంది...''

మరింకేమీ మాట్లాడలేదు. మౌనంగా డైరీ మూసేసి – ఆలోచనల్లో పడి పోయేడు రాధా కృష్ణ.

''చావుని నౌకరీగా యిచ్చింది ప్రభుత్వం...'' రాధాకృష్ణ ఆలోచనల్ని భగ్నం చేస్తూ, బంధువు వాపోయేడు.

''...కొడుకు – యీ నౌకరీకి వొప్పుకోలేదు. గాని, మా బతుక్కి దారిలేదు. ఆడపిల్లల పెళ్లిళ్లు – తమ్ముళ్ల చదువులూ యింటి బరువు యెత్తుకో వాల్సి ఒప్పుకున్నాడు. మా పేదరికమే – కొడుక్కి మృత్యువయ్యింది...'' తల్లి, దుఃఖపు గొంతు తెగింది....

''...... సార్, మా వాడు చనిపోయే ముందే మేనా మాట్లాడేడా?'' కొడుకు ఆఖరి మాట కోసం ఆరా తీయసాగాడు తండ్రి!

''విప్లవం వర్ధిల్లాలి – అన్నాడట...''' అన్యమ నస్కంగా జవాబిచ్చేడు రాధాకృష్ణ.

ఆశ్చర్యపోయేడు తండ్రి! వింతగా చూడసా గేడు ఎస్సయి...!

రాధాకృష్ణ – యీ ధ్యాసలోనే లేడు. మరణి నాకి ముందర 'వాళ్లో'పై దాడి చేసినప్పుడు – ధైర్యంగా, మరణాన్ని ఛాలెంజ్‌చేసి... సాగించిన వాళ్ల పోరాటమూ – మెన్ చెప్పారు.

ఆ చెప్పటంలో – అటువంటి 'వాళ్లో'ను మెన్ ప్రాణాలకు తెగించి హత మార్చారన్న భావనే వ్యక్తమైంది. 'వాళ్లో' తలల మీద ప్రకటించబడిన 'విలువల' మొత్తాన్ని గూడా లెక్కవేసి ఘనంగా చెప్పారు!

ఔనూ – యిప్పుడు గుర్తొచ్చింది – 'వాళ్లో' తలల మీద 'విలువ'ను లెక్కజెప్పిన మెన్ – 'వాళ్లో' దగ్గర వుండే డబ్బు సంగతి చెప్పలేదేం? ప్రతీ దళ సభ్యుడికీ, వీపున కిట్ బ్యాగు క్రింద, నల్లటి కేష్‌బ్యాగు... మెడలోంచి వేలాడుతూ వుంటుంది! వందల నుండి... లక్షల దాకా అందులో వుండొచ్చు! అదంతా యేమైనట్టు....?

ఆ ప్రశ్నతో – రాధాకృష్ణ యెదురుగా చూసేడు.

ఏడుపు మొహాలతో – మృతుల బంధువులు కన్పించేరు. అప్పటికీ, ఆలోచనల్లోంచి తేరుకు న్నాడు.


ఇంతలో ఫోన్ మోగింది ఎస్సయి, అందుకు న్నాడు. అట్నించి మాటలు విని, రిసీవర్ మూసి–

''ప్రెస్ పీపుల్ సార్... బాడీస్ కోసం ... యిన్ఫర్మేషన్...'' చెప్పాడు.

''...వెయిట్ చెయ్యమను. మళ్లీ ఫోన్ చెయ్య

కవిత
poem


# తేనె ఖర్జూరాలు
## (రెక్కలు)



తొలగేసుకుని
పోదామంటే ఎలా?
అది తాడో
పామో –

సందె
వేళ!


***



విజయాన్నో
అపజయాన్నో
దగ్గరగా చూడ్డం
అరుదే–


చూసిన కన్నే
చరిత్ర!

***



చీకట్లో
ఓ దారిని పట్టుకోవడం
తెగించి నడవడం
మాటలా?–

కొత్త సూర్యుడు
సాహసి!



గోడ వెనుక
నల్లగా ఎవడో
నిలబడి
పిలుస్తున్నాడంటావ్!–

ఎక్కడ
ఏ ఇంటిగోడ?


***



ఆ ముసిలోళ్లు
వస్తారనేముంది?
మళ్లీ ఏడాదికి
పండ్ల బుట్టతో

రోజుకో
కొత్త దూరం!

***



ఎడారిలోనే
పడింది విత్తనం
అయినా
బతికింది –

తనకు తానే రక్ష
ఖర్జూరం!

–యం.కె.సుగమ్ బాబు
సెల్: ***93925 17348***

మను...'' చెప్పాడు రాధాకృష్ణ.

ఇంతలో మృతిచెందిన మరో యిద్దరి పోలీస్‌మెన్ - బంధువులూ చేరు కున్నట్లుంది. గెస్టుహౌసనీ, ఎస్పీ దొరగారున్నారనీ, గోలగా యేడ్వవద్దనీ - యెన్ని హెచ్చరికలు చేసినా - దుఃఖపు కెరటాలు యెగసి తోసేసాయి. ఏడుపు మొరల్లో.... చేరిపోయేరు.

కానిస్టేబుల్ విషయం చెప్పాడు. రాధాకృష్ణ వెంటనేలేచి - గది బయటకు - మృతుల బంధువుల దగ్గరకు నడిచేడు. బంధువులను సానుభూతితో చూస్తూ, ఓ క్షణం విచారంగా మొహం పెట్టి - మౌనంగా నిల్చున్నాడు. తర్వాత, గొంతు పెగల్చుకొని-

''..... జరిగిందానికి బాధపడ్తున్నాం - మీరు గుండెలు చిక్కబట్టుకోవాలి. మీకు ప్రభుత్వం నించి రావలసినవన్నీ - రప్పిస్తాను...'' మాటలు వెదుక్కోసాగేడు.

''యేవి రప్పిస్తారు సారూ....! చావుకి... కిరాయి! మరో చావుకి... మరో బిడ్డకు నౌకరీ... యింతేనా?'' యేడ్పు కంఠంతో ఓ బంధువు ప్రశ్నించేడు.

''...నిన్నననగా చనిపోతే - యిప్పటికి శవాలనే రప్పించలేదు - ప్రభుత్వం నించీ రావలసినవిలాగే - రప్పిస్తారు తవరు...'' నిష్ఠూరంగానే యీసడించేడింకో బంధువు.

రాధాకృష్ణ మనసులో దుఃఖం నిండసాగింది. ఈ చావులూ - బంధువుల శోకాలూ - సకల జీవన చలన బంధాలను - చటుక్కున తెంపేసిన - ఆ 'ఆపరేషన్' ఆలోచించిన వాళ్లం - యిది ఎందుకాలోచించలేదు. మృత్యువు 'వాళ్లకే' గాని - యీ వైపు వుండదనుకున్నామా? అయినా - 'వాళ్ల' మృతి అయినా - దుఃఖం... అందరికీ ఒకటేగా - దుఃఖానికీ, శోకానికీ కూడా భోగభాగ్యాల్లాగా - వర్గభేధముంటుంది ... అరెస్టయిన ఓ సందర్భంలో 'వాళ్ల'లో ఒకడు తన యింటరాగేషన్‌లో చెప్పిన జవాబు గుర్తొచ్చింది.

ఇంతలో బంధువుల ముందుకు, నలుగురు వ్యక్తులు వచ్చేరు. రాధాకృష్ణ వైపు చూస్తు.

''... అన్ని బాడీస్ వస్తున్నాయా సార్...?'' అని ప్రశ్నించేడో వ్యక్తి.

''అన్నీ - అంటే...?''

''పోలీస్‌మెన్‌తో బాటు 'వాళ్ల' బాడీస్...''

అప్పుడు రాధాకృష్ణకు అనుమానమెచ్చింది. ఆ నలుగుర్నీ చుట్టూ వున్న బంధువులనూ - అనుమానంగా చూస్తూ.

''మీరెవరు..?'' ప్రశ్నించేడు.

''పౌర హక్కుల వాళ్లం...''

''మృతులకు బంధువులు కారుగా..''

''కాకపోతే రాగూడదా?''

''అందరికీ సమాధానాలు చెప్పాల్సిన అవసరం మాకు లేదు..''

''యూ షుడ్ యాక్ట్ లీగల్లీ..''

''వాటీజ్ యిల్లీగల్...?''

మెన్ బాడీస్ రప్పిస్తూ 'వాళ్ల' బాడీస్ వొదిలెయ్యటం యిల్లీగల్...

ఈ వాగ్వివాదం జరుగుతుండగా - ఎస్పీ ప్రభాకర్‌జైన్, యిద్దరు డిఎస్పీలూ, కొందరు మెన్ - వారితోబాటూ, నియోజకవర్గ ఎమ్మెల్యే, అతని అనుచర జనం చేరారు. కార్లూ, వేన్లపై ప్రెస్‌పీపుల్ గూడా వచ్చేరు. రాధాకృష్ణ - పౌరహక్కుల వారివైపు నిరసనగా చూసి, తిన్నగా ఎమ్మెల్యే దగ్గరికి నడిచేడు.

''... వచ్చేస్తాయి సార్! ప్లేస్ ఆఫ్ క్రైమ్ యీజ్ డీప్ ఏజెన్సీ! కొండలూ, కోనలు మీదుగా పదిహేను కిలోమీటర్లు నడవాలి. నిన్న మధ్యాహ్నానికి ఎన్‌కౌంటర్ ఆగింది. గానీ బాడీస్ కోసం యెలా ముందుకెళ్తాం? ఎక్కడో 'వాళ్లు' మాటుగాసేరేమో? మరో రెండు గంటలు, సైలెంట్‌గా అబ్జర్వ్ చేయించాం. తర్వాత - మృతదేహాల దగ్గరకు 'మెన్' వెళ్లారు. 'ముగ్గురి మెన్' దేహాలు చెట్లూ, పుట్టల మధ్య 'వాళ్ల'వీ పది దేహాలూ - పడి వున్నాయి.

''అప్పటికి ఈవెనింగ్ ఫోర్ అయ్యింది. సన్‌సెట్ వేళ. ఆ కొండల్లోంచి కింద జంక్షన్‌కి దిగి రావటానికి ఎట్లీస్ట్ సిక్స్ అవర్స్ పడుతుంది. సహ చరుల బాడీస్ మోస్తూ మెన్ దిగాలు పడిపోయారు. బాడీస్ తీసుకు వెళ్తున్నప్పుడు మళ్లీ కాల్పులు జరిగితే అప్పుడు భారీనష్టం మనదవు తుంది. అందుకని వెంటనే చుట్టుప్రక్కల గూడేల ప్రజల్ని పట్టుకో మన్నాం. గూడేల ప్రజలు పశువులపై కాల్పులు జరిగాయనీ, కాపరి వొకనికి గుండు దూసుకుపోయిందనీ యేడుపూ మొరల్లో కొంతమంది వుండగా - యెక్కువమంది అరణ్యంలోకి పరారయ్యేరు. చాలా యిళ్లు తలుపులు మూసేసి వున్నాయి. నచ్చజెప్పి, బెదిరించి పదిమంది జనాలను పట్టుకొచ్చేసరికి... పొద్దువాలే వేళయ్యింది. ఇంతలో సన్నగా చినుకులారంభించేయి. తడుస్తూ... నానుతూ, పొజిషన్‌లో ఎలర్టవుతూ - తమ సహచరుల బాడీస్ జనానికి చూపించి - పదిమంది చేతా కిందకి మోయించుకొచ్చేరు. నిజానికి తల్చుకుంటే ఆ దృశ్యం... చీకటి ముసిరేలే, చినుకులు, సహచరుల మృతదేహాలు, మళ్లీ కాల్పుల ప్రమాదం... రోమాలు నిక్కబొడుస్తాయి'' రాధాకృష్ణ నిజంగానే, ఉద్వేగానికి లోనయి, గొంతులో నిన్నటి మెన్ స్థితినంతటినీ పలికేంచేరు.

''.... మరి, అంతకష్టపడి బయల్దేరి... మరి మధ్యలో యెందుకాగిపోయేరు..? ఆ రాత్రే యిక్కడకు తెచ్చేయాల్సింది...'' ఎమ్మెల్యే గారు, విసుగు కన్పించనీకుండా, ధ్వనింపజేసారు.

అర్థమైంది రాధాకృష్ణకు.

ఇప్పటిదాకా 'వాళ్ల'ను ఎన్‌కౌంటర్‌లో హతం చేయటమే ఒక విజయంగా, దాన్నో సాహసగాథగా తానూ, తన మెన్ భావించుకు వొచ్చేం. తన లోలోపలి కథకుడూ కదిలిపోయేడు. ఇప్పుడు - బాడీస్ రాక ఆలస్యం గావటం - 'నిన్నటి'లోకి విజయగాథ వెళ్ళిపోయి - 'నేటి'లోకి వైఫల్యం... యెత్తి చూపబడటం - రాధాకృష్ణలో నైరాశ్యాన్ని నింపింది.


....ఔను, యీ మొత్తం వ్యవహారానికి దూరంగా వుండాల్సింది... అనుకున్నాడు ఆ క్షణాన.

అది సాధ్యమా? డ్యూటీ,... యిదంతా డ్యూటీ... డ్యూటీకి దూరంగా యెలా వుండగలను?'' అని జవాబు చెప్పుకున్నాడు.

అప్పుడాయనలో మరికొన్ని ప్రశ్నలు బయల్దేరాయి.

''వాళ్ళ''ను హతమార్చటానికి ఉచ్చు బిగించటం డ్యూటీయే? ఈ ''డ్యూటీ''కి పౌరహక్కుల వాళ్లన్నట్టు లీగాలిటీ వుందా? అన్ని యెత్తులూ - జిత్తులూ వేస్తున్నాం... యివన్నీ 'డ్యూటీ'యే? యీ ప్రశ్నల పరంపర లోనే... మళ్లీ ఆయనకు పూర్ణక్క డైరీలో వాక్యాలు గుర్తొచ్చేయి.

''...మనం గ్రామాలను విముక్తిజేసి, నగరాలను చుట్టుముట్టి - దేశాన్ని విముక్తి జెయ్యాలన్నది మన లక్ష్యంగా చెప్పుకొస్తున్నాంగానీ, మన శత్రువు - ముఖ్యంగా సామ్రాజ్యవాది - అట్నిం



చిటు – యిప్పుడు గ్రామాలన్నీ ఆక్రమించేడు. ఇప్పటి గ్రామాలు – మన వ్యూహాత్మక గ్రామాల్లా లేవు. మారిపోయేయి. మనుషుల మధ్య సంబంధాలు మారిపోయేయి. ఒకప్పటి మన సానుభూతిపరుడే – యిప్పుడు – ఆవలి పక్షంలో ఉంటున్నాడు. ఇవన్నీ మనం గమనంలోకి తీసుకోవాలి. మూస పద్ధతిలో పంథా గురించి చర్చించొద్దు. మన శత్రువు మూస పద్ధతి నొదిలేసి – కొత్త కొత్త పద్ధతుల్లో నిల్చుంటున్నాడు. నీళ్లని తోడి చేపల్ని వేటాడే పద్ధతి మరోవైపు అమలు చేస్తున్నాడు. తీవ్ర నిర్బంధం, లక్షల రూపాయల ఆశ జూపి ఇన్ఫార్మర్ల తయారీ, ముఖ్యంగా కొందరు పోలీసు అధికార్లు భూస్వామ్య పెట్టుబడిదారీ వర్గాల బిడ్డలు. వాళ్ళు దీన్నంటినీ ప్రతిష్ఠగా తీసుకొని, లిమిట్స్ దాటి, అంతా తామే అయి మన మీద క్రూర హత్యాకాండకు దిగుతున్నారు...''

రాధాకృష్ణకిప్పుడు తను దాటిన లిమిట్స్ గుర్తొచ్చేయి.

రహస్యంగా – యిన్ఫార్మర్లని సృష్టించటం – తమ పరిధిలో గానటువంటి ఇతర రాష్ట్ర భూభాగంలోకి వెళ్లటం నిరాయుధంగా వున్న వారినయినా – బంధించే యత్నం చేయక వధించటం – అన్నీ తామే అయి – వ్యధ స్థలానికి ఆపరేషన్ పూర్తయ్యేదాకా యెవర్నీ రానీయకపోవటం ఇన్ని... యివన్నీ... లిమిట్స్ దాటి చేసిన 'డ్యూటీ?..?'

ఇన్ని జేసినా – యిలా 'వాళ్లను రూపుమాపటం – సాధ్యమేనా? తుపాకీతో 'వాళ్ల' ఉద్యమాన్ని ఆపగలమా...? ప్రశ్న రూపుదిద్దుకోగా – జవాబుగా.

''తుపాకీతో 'వాళ్లు' ఉద్యమాన్ని విజయవంతం చెయ్యలేరు...'' ప్రభాకర్ జైన్ మాట గుర్తొచ్చింది.

ఆలోచనల్లో వున్న రాధాకృష్ణను చూసి, ఎమ్మెల్యే–

''సరే మళ్లీ వస్తాను. బాడీస్ వస్తే కబురు చెయ్యండి..'' అని చెప్పి కదిలేరు. పౌరహక్కుల వాళ్లు – ఎమ్మెల్యేని పట్టుకొన్నారు. 'వాళ్ల' మృతదేహాల కోసం బంధువులు వచ్చేరనీ – మృతదేహాలకు కర్మకాండ విషయంలో రాజకీయాలు నడ్డు చూపగూడదనీ వివరించేరు. ఆ ఎమ్మెల్యే – యేమీ అనలేక – ''మళ్లీ వస్తానుగా .... వెళ్లటానికి నిలబడ్డాడు అడ్డుగా! పోలీసులు చేరారు. పోలీసులకి, ఎమ్మెల్యేకి వ్యతిరేకంగా వాళ్లు కేకలు వేసారు.

మరణించిన 'మెన్' తాలూకా బంధువులు – వీళ్ళకు వ్యతిరేకంగా కేకలు వేసారు. అంతా ఘర్షణ మయమైంది. తుపాకుల పోలీసులు గానీ, ప్రజాప్రతినిధిగానీ ఆ ఘర్షణను ఆపలేకపోయారు.

ఇంతలో–

వరుసగా రెండు జీపులూ, వాటి వెనుకా ఆర్టీసి బస్సు, దాని వెనుకో వేనూ... హారన్లు మోగించుకు వచ్చేయి.

వెంటనే రాధాకృష్ణ మెన్‌ని ఎలర్ట్ చేసాడు. ఘర్షణ పడుతున్న జనాలను చెల్లాచెదురుచేసి – వచ్చిన వాహనాల చుట్టూ పోలీసు వలయాన్ని యేర్పిరిచేరు. బస్సులో గల దేహాలను జాగ్రత్తగా దింపించి అప్పటికే సిద్ధం చేసిన వేదిక మీదకు చేర్పించేరు. దేహాల నిండుగా – వస్త్రాలు కప్పేసి వున్నాయి. శవవాసన రాకుండా సెంట్ అయినా గొట్టినట్లు లేదు. రాధాకృష్ణ మృతుల బంధువులను పిలిపించేరు. ఎమ్మెల్యేతో పాటుగా అందరూ దేహాల వద్దకు చేరినారు. రాధాకృష్ణ బాధాతప్త హృదయంతో మృతదేహాల మీది వస్త్రాలను తొలగించేడు! అంతే... విద్యుత్ షాక్‌కి గురయినట్లు వెనక్కి తూలిపోయేడు!

ఆలివ్ గ్రీన్ యూనిఫారంలో మరణించిన 'వాళ్లు' దేహాలవి!

మృతుల బంధువులు.

''మా బిడ్డలని దెచ్చామని 'వాళ్ల'ని తెచ్చి చూపిస్తారేటి? మా బిడ్డల శవాలని చూపండి బాబులూ... చూపండి. మా గుండెకోత... మీ కింకా అర్థం గాదా...?'' ఆక్రోశించేరు.

రాధాకృష్ణ సీరియస్‌గా ఎస్పీ వైపు చూసేరు. ఎస్పీ అయోమయంగా బస్సునీ, వేనునీ, జీపులనూ మెన్‌ని చూసేడు.,

ఆ అధికార్ల అనుమానపు చూపుకి బస్సూ, వేనూ జీపులూ, మెస్... పరిసరమంతా ముద్దాయిల్లా గజగజలాడినాయి.

''...అంతా అయోమయంగా వుంది సార్! ఎలా జరిగిందో అర్థం గాలేదు. నిన్న రాత్రి... చీకటి, వర్షం బాడీస్‌ని ట్రైబ్స్ కప్పగించి మోయించేం. కింద జంక్షన్‌కి చేరేసరికి పదకొండు దాటిపోయింది. ఆ రాత్రి ఏజెన్సీ రూట్ – యెక్కడ మందు పాత్ర పేలుద్దో–నని ఆలోచించి, జంక్షన్లో గెస్టు హౌస్‌లో వుండిపోయేం. ఎవరం అనుమానించలేదు''.

సంజాయిషీగా ఎస్పీ యేదో చెప్పబోయేడు.

''మోసిన సవరోళ్లే యీ పని జేసుంటారా....?'' ఎమ్మెల్యే ప్రశ్నించేడు.

''బాడీస్ నిండుగా గుడ్డలు కట్టేసి అప్పజెప్పటంతో – మళ్లీ యిప్పటిదాకా చెక్ చెయ్యలేదు. కప్పిన గుడ్డల్నే చూసేంగాని వాటికింద దేహాల్ని...'' ఎస్పీ

''మరిపుడెలాగ...?'' ఎమ్మెల్యే.

''ముందు యీ బాడీస్‌ని బస్సెక్కించండి, జనాలని దూరంగా పంపెయ్యండి. ఎవరికేం చెప్పకండి. ఇన్‌క్లూడింగ్ ప్రెస్ పీపుల్... ఊc....'' అని ఆదేశాలు జారీచేసి, అక్కడి నుండి రాధాకృష్ణనూ, ఎమ్మెల్యేనీ, ఎస్పీనీ,... తీసుకొని ఛాంబర్‌లోకి నడిచేడు ప్రభాకర్ జైన్, ఆయన బాడీస్ వచ్చినప్పుడే వచ్చేడు.

రాధాకృష్ణకు అంతా అయోమయంగా వుంది. ఇదంతా తను రాస్తోన్న కథా...? రాయదల్చిన కథ తుదకు వాస్తవ ఘటనలా...?

ప్రభాకర్ జైన్ గొంతు విప్పేడు.

''అజాగ్రత్త వలన జరిగిందిది. ముఖ్యంగా అభద్రతా భయం వల్ల గూడా! సరే – యేమైనా ఫేస్ చెయ్యాల్సిందే!'' అన్నాడు.

''ఔను పోలీస్ బాడీస్ లేకపోతే – బంధువులు ఊరుకోరు..'' ఎమ్మెల్యే.

''ఔనౌను. బాడీస్ తేవాలి...'' రాధాకృష్ణ.

''.... వాళ్లు ప్లాన్డ్‌గాచేస్తే తప్పక వెళ్లేవాళ్ల మీద ఎటాక్ వుంటుంది. లేదూ,



## నయనతారను కట్టడి చేస్తున్న ప్రభుదేవా!

ఇంకా ఇద్దరికీ పెళ్ళి కానే లేదు. అప్పడే కాబోయే భార్య మీద ప్రభుదేవా అధికారం చెలాయిస్తున్నాడని ఫిలింనగర్‌లో పుకార్లు షికారు చేస్తున్నాయి. 'వివాహం తరువాత నటించకూడదనీ, ముంబాయికి షిఫ్టు అయి, ఇంటికే పరిమితం కావాలన్న' స్పష్టమైన సూచనలు ప్రభుదేవా నుంచి నయనతారకు అందాయని, అందుకే నయనతార కొత్తగా సినిమాలు అంగీకరించకుండా, చేతిలో ఉన్న సినిమాలు త్వర త్వరగా పూర్తి చేసేస్తోందన్నది ఆ పుకార్ల సారాంశం. అయితే నయనతార వ్యవహారం ఆమె అభిమానులకు ఏమాత్రం మింగుడు పడడం లేదట! ప్రభుదేవా ఇప్పుడే నయనతారను ఈ విధంగా కట్టడి చేస్తే భవిష్యత్తులో నయనతార పరిస్థితి ఎలా ఉంటుందో అన్న సందేహాన్ని ఆమె అభిమానులతో పాటు, సన్నిహితులు కూడా వ్యక్తం చేస్తున్నారు. భవిష్యత్తు ఎలా ఉన్నా సరే, పట్టించుకోకూడదు అన్న నిర్ణయానికి నయనతార వచ్చిందట! అందుకే కాబోయే భర్త అదుపు ఆజ్ఞలలో ఎలా ఉండాలో కూడా నేర్చుకుంటోందట!

# సృష్టిలో గొప్ప ప్రాణి ఏది? ఎందుకని?

## సందేహాలు - సమాధానాలు

**పద్మలత, విజయవాడ**

***తమ దోషాల నుంచి స్త్రీలు ఎలా బయటపడాలి ?***

గతజన్మ పాప ఫలం కొంత, పుణ్య కార్యాల లేమి ఫలం కొంత ప్రతివారినీ వెంటాడుతుంది. అందుకే ప్రతిమనిషి పుణ్య కార్యాలు ఆచరించాలి. అది వారి మరణానంతరం వెంట వస్తుంది. అదే వారిని కాపాడుతుంది. అదేవిధంగా ఇక్కడ స్త్రీలకు కూడా ఐదుదోషాలు కలుగుతాయి. ఈ దోషాలు కలిగిన వారు గోవ్రతం చేయడం ద్వారా దోషాలను తొలగించుకోవచ్చును. రజస్వల కాక పోవటం, సంతాన లేమి, ఏక సంతానం, గర్భం నిలుపుకోలేకపోవటం, ఆడ సంతానం మాత్రమే కలగడం వంటివి వారికి ఎదురయ్యే దోషాలు. పిల్లలను హింసించడం, భార్యాభర్తలను విడదీయడం, పర పురుషుణ్ణి కోరుకోవడం వంటి పాపాల వల్ల వారికీ దోషాలు కలుగుతాయి. మహాపాతకం చేసి పాపపరిహారం కోరిన జనమే జయునికి ఉపదేశ సమయంలో వైశంపాయనుడు ఈ విషయం చెప్పాడు.

**బి.పుణ్యవతి, హైదరాబాద్**

***అన్నదానం వల్ల కలిగే పుణ్యం ఏమిటి ?***

అన్న దానం వల్ల పుణ్యం ప్రాప్తిస్తుంది. ఐతే అన్నదానం చేసే ప్రదేశాన్ని బట్టి మనకు లభించే పుణ్యం కూడా రెట్టింపు అవుతుంది. దేవాలయాలలో అన్నదాన కార్యక్రమాలు చేస్తే మహా శ్రేష్ఠం. అదికూడా పుణ్యతీర్థ ప్రదేశాలలో అన్నదానం చేస్తే గత జన్మలో చేసిన పాపాలు నశిస్తాయి. వికలాంగులకు, వృద్ధులకు అన్న దానం వల్ల నాలుగింతలు పుణ్యం. యజ్ఞయాగాదులు ఒకవైపు జరుగుతుంటే అదే చోట అన్నదానం చేస్తే ఈ జన్మలో పాపాలన్నీ నశిస్తాయి. దేవాలయాలలో అన్నదాన కార్యక్రమాలకు వితరణ చేయడం ముల్లోకాలలో దానం చేసినంత పుణ్యం.

**కొత్తపల్లి నాగేంద్ర కుమార్, టి.నగర్.**

*సృష్టిలో గొప్ప ప్రాణి ఏది ? ఎందుకని ?*

సృష్టిలో గొప్ప ప్రాణి మానవుడే! 84 లక్షల జీవరాసుల్లో మానవ జన్మ అత్యుత్తమమైనది. షడ్రుచులను ఆస్వాదించడం, నవరసాలను పండించడం, ప్రకృతిని జయించి తనను తాను రక్షించుకోగలగటం మానవజన్మకే సాధ్యం. అందుకే జంతూనాం నరజన్మ దుర్లభం అన్నారు. ఒకసారి మానవ జన్మ ఎత్తాలంటే 84 లక్షల జీవ రాసుల జన్మల క్రమాన్నీ ఒక్కొక్కటీ పూర్తి చేస్తూ రావాలి. ఇంత దుర్లభమైన మానవజన్మను జీవ రాసులు ఎంతో కష్టపడి సంపాదించుకుంటాయి. అయితే ప్రతిజీవికి గతజన్మ స్మృతులు ఉంటాయి. గతజన్మ జ్ఞానం ఉంటుంది. వాటి పాపఫలమేమిటో వాటికి తెలుస్తాయి. మహా పుణ్యఫలాన్ని బట్టే నరజన్మలో కూడా ఈ జ్ఞానం లభ్యం కాగలదు. బుద్ధి కుశలత, ఆలోచనా శక్తి మానవునికి ఉన్న గొప్పవరం. అందుకే ధర్మాన్ని అనుష్ఠించడంతోపాటు సకల జీవరాసులను కాపాడాల్సిన బాధ్యత అనగా నేటి భాషలో జీవ వైవిధ్యాన్ని కాపాడాల్సిన బాధ్యత నరజన్మకే ఎక్కువ ఉంది. నరజన్మలో చేసిన పాపాలు లేదా పుణ్య కార్యాలను బట్టే వారు తిరిగి 84 లక్షల జీవరాసులుగా జన్మించాల్సిన అగత్యమో లేక జన్మ రాహిత్యమో మోక్షమో లభిస్తుంది. అందుకే హిందూమతం సకల ధర్మాలను ఆచరిస్తూ జీవనం సాగించాలని బోధించింది. ఈ ధర్మాన్ని ఉల్లంఘించి పాపకర్మలకే పరిమితమైతే తిరిగి మొదటినుంచి అన్ని జన్మలూ ఎత్తుతూ రావల్సిందే! జన్మజన్మల పాప కర్మఫలాన్ని ఈ విధంగా అనుభవించాల్సిందే!

**రాఘవేంద్రరావు, దేవరపల్లి**

*ఏ వేళలో ఏ గుడిని దర్శించాలి ?*

సూర్యోదయం నుంచి సూర్యాస్తమయం వరకు మనం ఆలయాలను ఒక క్రమ పద్ధతిలో దర్శిస్తే దైవ కృప నిండుగా వుంటుంది. శివాలయానికి ఎప్పుడూ సంధ్య వాలుతున్న సమయంలో వెళ్ళి దర్శనం చేసుకుంటే ఎక్కువ ఫలితం లభిస్తుంది. శివుడు లయకారకుడని గమనించాలి. ఆ సమయంలో ప్రశాంత చిత్తంతో శివ దర్శనం చేయాలి. శ్రీమహావిష్ణువును ఉదయం పూట దర్శిస్తే మంచిది. ఆపదలను తొలగించి కాపాడతాడు. బుద్ధి వికసిస్తుంది.

**మీ సందేహాలకు సమాధానాలు ఆశిస్తే మీరడగదల్చుకున్న ప్రశ్నలను కార్డుపై రాసి కింది చిరునామాకు పంపండి**

**సందేహాలు-సమాధానాలు, నవ్యవీక్లీ, ఆంధ్రజ్యోతి బిల్డింగ్స్, ప్లాట్ నెం. 76, అశ్వనీ లే అవుట్, హుడా హైట్స్, జూబ్లీ హిల్స్, హైదరాబాద్ - 500033**

---

సవరలే కసికొద్దీ మనల్ని యిబ్బంది పెట్టడానికి చేస్తే - ఫర్లేదు లేదా మెన్ బాడీస్ తీసుకుపోయి. 'వాళ్ళ'వి అడవిలో వదిలేస్తారు - అని కసికొద్దీ చేస్తే వారిపై కన్నేయాలి...'' ప్రభాకర్ జైన్.

''.....ఒకవేళ యెవరేనా... మెన్‌లో 'వాళ్ల......' ఎమ్మెల్యే మాట సగంలోనే ఆపేసారు.

''వాళ్ల బాడీస్ పది. మనవి మూడు. ఆ మూడు బాడీస్ రావటంతో యెవరేమీ అనుమానించలేదు...'' ప్రభాకర్‌జైన్.

''సరే, యిప్పుడు - మెన్ గూడా భయపడ్డారు.... వెళ్లటానికి! అదనంగా ఫోర్స్ రప్పించాలి...'' రాధాకృష్ణ.

''అక్కర్లేదు. ఈ ఫోర్స్ చాల్ను. గానీ, ఓ పని చెయ్యాలి. ఆ పౌరహక్కుల వాళ్లని వెంటబెట్టుకు వెళ్దాం. అప్పుడు సేఫ్టీ వుంటుంది...'' ప్రభాకర్‌జైన్.

రాధాకృష్ణకిదంతా తప్పుడు పద్ధతులు అమలు వల్ల యేర్పడ్డ విషాదమన్పిస్తోందిప్పుడు. మరి 'వాళ్లు'... 'వాళ్ల' విషాదమూ... తప్పుడు పద్ధతుల ఫలితమేనా....

''సరే, పౌరహక్కుల వార్ని, నేనూ చెప్పి వొప్పిస్తాను. పదండి బయల్దేరండి మరి...''

ఎమ్మెల్యే లేచారు. అందరూ బయటికొచ్చి, పౌరహక్కుల వారికోసం... కబురు పంపేరు. వాళ్లు వచ్చేరు. విషయమంతా విన్నాక - మొదట ఒప్పుకోలేదు. అయితే, రాధాకృష్ణ, ఎమ్మెల్యే నచ్చ చెప్పాక అంగీకరించేరు. అయితే, రెండు షరతులు పెట్టారు.

పౌరహక్కుల వారూ, పదిమంది ప్రజలు మాత్రమే - స్పాట్‌కి బాడీస్ కోసం వెళ్లారు. పోలీసులు తోడు రాగూడదని వొక షరతూ.

వచ్చేసిన 'వాళ్ల' మృతదేహాలు మూడింటినీ - 'వాళ్ల' బంధువుల కప్పగించాలని మరో షరతు!

అంగీకరించక తప్పలేదు అధికార్లు!

అప్పుడు ఆర్టీసీ బస్సులో - పౌరహక్కుల వాళ్లూ, కొంతమంది ప్రజలూ, బయల్దేరారు. ఇటు వైపు, బస్సులోంచి దించిన 'వాళ్ల' దేహాలమీద 'ఎర్ర జెండా'లు కప్పి బంధుమిత్రులు మోసుకు పయనమయ్యేరు వాళ్లలో యెవరో.

''పడమటి దిక్కూ నెన్నియలో...

పొద్దూ గుకిందెన్నియలో...

వొరిగిన అన్నల కెన్నియ్యలో - ఎర్రనిదండాలెన్నియలో...'' పాట యెత్తుకున్నారు. ముందుకు కదిలేరు.

సాయుధ బలగం - గుడ్లప్పగించి చూస్తూ నిలబడిపోయింది. ఎమ్మెల్యే అనుచర జనం వెళ్లిపోయారు.

కథా - వర్తమానమా..?

కథకయినా -

వర్తమానానికయినా-

యిది ముగింపేనా - సంశయంలో రాధాకృష్ణ!

*